క్లుప్తంగా

మాస్టర్‌మైండ్స్‌లో రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న విద్యార్థులు

తిరుపతి ఎడ్యుకేషన్‌: తిరుపతిలో మాస్టర్‌మైండ్స్‌ విద్యాసంస్థలో సోమవారం 76వ చార్టర్డ్‌ అకౌంటెంట్స్‌ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ విద్యాసంస్థలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆ విద్యాసంస్థ అడ్మిన్‌, అకడమిక్‌ ప్రిన్సిపల్స్‌ ఆంజనేయులు, కేవీ రామారావు, విద్యార్థులు అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌ పుస్తకాలు పంపిణీ


నోటు పుస్తకాలు, పలకలను అందజేస్తున్న ట్రస్టు నిర్వాహకులు

చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరులోని మండల పరిషత్‌ ప్రాథమిక పాఠశాల (తూర్పు)లోని విద్యార్థులకు దాతలు ఉచితంగా నోటు పుస్తకాలను సోమవారం పంపిణీ చేశారు. తిరుపతి రూరల్‌ మండలం బ్రాహ్మణపట్టుకు చెందిన శ్రీదేవి భూదేవి రంగనాయకుల ఎడ్యుకేషనల్‌, చారిటబుల్‌ ట్రస్టు ఆధ్వర్యంలో నోటు పుస్తకాలు, పలకలను అందజేసినట్లు ట్రస్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎంతోపాటు ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పింఛన్‌ పంపిణీ


అక్కగార్లకాలనీలో పింఛన్ల పంపిణీ

చంద్రగిరి: అక్కగార్లకాలనీ వద్ద సోమవారం ఎన్టీఆర్‌ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పులివర్తి నాని పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు మొదటి నెల నుంచే పింఛను పెంచి పంపిణీ చేస్తున్నామన్నారు. జెడ్పీటీసీ చిల్లకూరు యుగంధర్‌ రెడ్డి, సర్పంచ్‌ ముదికుప్పం రూప, ఎంపీడీఓ సూర్యసాయి, తహసీల్దార్‌ మారుతి, టీడీపీ సీనియర్‌ నాయకుడు రమేష్‌రెడ్డి, పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, హేమాంబరధరరావు, మాజీ జెడ్పీటీసీ అమ్ములు తదితరులు పాల్గొన్నారు.

యల్లమ్మ తల్లికి పొంగళ్లు


విశేషాలంకరణలో యల్లమ్మ తల్లి

ఏర్పేడు: మండలంలోని ఎండీ పుత్తూరు యల్లమ్మ తల్లి ఆలయం వార్షికోత్సవం సందర్భంగా సోమవారం గ్రామస్తులు పొంగళ్లు సమర్పించారు. అమ్మవారి విగ్రహానికి విశేషాలంకరణ చేసి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పూజారి అభిషేకాలు చేశారు. మహిళలు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి అమ్మవారికి ధూప దీప, నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం అమ్మవారిని పుర వీధుల్లో ఊరేగించారు. ప్రతి ఏడాది గ్రామస్తులు అమ్మవారికి పొంగళ్లు పెట్టేది ఆనవాయితీగా వస్తోంది. కార్యక్రమంలో సర్పంచ్‌ మోహనప్రియ పాల్గొన్నారు.

మృత్యుంజయస్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకారంలో మృత్యుంజయస్వామి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మృత్యుంజయ స్వామికి సోమవారం ఆగమోక్తంగా ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా గణపతి పూజ, కలశ స్థాపన పూజలు చేశారు. అనంతరం స్వామివారికి చందనం, నారికేళ్ల, పసుపు, కుంకుమ, విభూధి వంటి వాటితో అభిషేకాలు చేశారు. అనంతరం సుందరంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు.

గడప వద్దకు కాదు.. వీధుల్లోనే పంపిణీ


పింఛన్ల పంపిణీకి వీధుల్లోనే వృద్ధుల ఫొటోలు తీస్తున్న సచివాలయ ఉద్యోగులు


వీధుల్లో వేచి ఉన్న పింఛన్‌ లబ్ధిదారులు

- పింఛన్‌దారులకు తప్పని తిప్పలు
- గంటల తరబడి నిరీక్షణ
- చోటా నాయకుల కోసం తప్పని ఎదురుచూపులు

తిరుపతి తుడా: కోడి కూయకముందే ఇంటి వద్దే పింఛన్‌ అందిస్తామని చేసిన ఆర్భాటం తొలిరోజే తేలిపోయింది. లబ్ధిదారులకు గంటల తరబడి నిరీక్షణ తప్పలేదు. తిరుపతి మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధిలో సోమవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. నగర మేయర్‌ డాక్టర్‌ శిరీష, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కమిషనర్‌ అదితిసింగ్‌, డిప్యూటీ మేయర్‌ ముద్రనారాయణ సంయుక్తంగా పెంచిన పింఛన్లను పంపిణీ చేశారు. పలు ప్రాంతాల్లో నేరుగా ఎమ్మెల్యే పాల్గొని పింఛన్లు పంపిణీ చేశారు. తొలిరోజు కావడంతో పింఛన్‌దారులు గంటల తరబడి నిరీక్షించారు. ఎప్పుడు ఎక్కడ పింఛన్‌ ఇచ్చేందుకు వస్తారో తెలియక తికమక పడ్డారు. పింఛన్ల పంపిణీలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

తప్పని తిప్పలు

తిరుపతి మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధిలోని యాభై డివిజన్లలో 19,343మంది లబ్ధిదారులు ఉన్నారు. మొత్తం 103 సచివాలయాలు ఉండగా అందులో వెయ్యి మంది వరకు కార్యదర్శులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఇంటి వద్దకే వెళ్లి పింఛన్‌ అందించాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే ఆ దిశగా ఎక్కడా ఏర్పాట్లు కనిపించలేదు. సచివాలయాల సిబ్బంది ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్‌ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నా స్థానిక టీడీపీ చోటా నాయకుల కారణంగా అది సాధ్యం కాలేదు. పింఛన్‌ అందించేటప్పుడు స్థానిక నాయకులు ఉండాలని చెప్పడంతో ఇంటి వద్దకే పింఛన్‌ సాధ్యపడలేదు. డివిజన్‌ నాయకులు వారికి అనువైన ఒక ప్రాంతాన్ని ఎంపిక చేసి సచివాలయ సిబ్బందిని అక్కడికి రమ్మని హుకుం జారీ చేశారు. ఆ ప్రాంత లబ్ధిదారులను సైతం అక్కడికే రమ్మని చెప్పారు. దీంతో చేసేది లేక పింఛన్ల కోసం యథావిధిగా నాయకుల వద్దకు పరుగులు పెట్టాల్సి వచ్చింది. అలా గుంపులుగానే లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు.

నాయకుల కోసం పడిగాపులు

నాయకులు గుమికూడే క్రమంలో గంటల తరబడి నిరీక్షణ తప్పలేదు. ఒక్కో డివిజన్‌లో రెండుమూడు చోట్ల ఇలాగే గుంపులుగా ఏర్పడి లబ్ధిదారులను అక్కడికే పిలిపించి పింఛన్లు ఇచ్చారు. ఈ సమాచారం తెలియక వృద్ధులు, వికలాంగులు వారివారి ఇంటి గుమ్మాల వద్ద ఎదురుచూశారు. కొన్ని ప్రాంతాల్లో తెలుగుదేశం నాయకులు తాము వచ్చేంతవరకు పింఛన్‌ ఇవ్వవద్దని చెప్పడంతో సాయంత్రం వరకు పింఛన్‌దారులు పడిగాపులు గాసి నీరసించిపోయారు.




తిరుపతిలో 27వ డివిజన్‌ తాతయ్యగుంటలో పెన్షన్‌ కోసం రోడ్డుపై నిలబెట్టి ఫేస్‌ రీడింగ్‌, వేలి ముద్రలు తీసుకొంటున్న సచివాలయ ఉద్యోగులు, అవస్థలు పడుతున్న వృద్ధులు

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు



తిరుమలలో మాజీ డిప్యూటీ స్పీకర్‌ కోలగట్ల వీరభద్రస్వామి, సినీ నటుడు సందీప్‌, దర్శకుడు మాధవ్‌

తిరుమల: శ్రీవారిని సోమవారం మాజీ డిప్యూటీ స్పీకర్‌ కోలగట్ల వీరభద్రస్వామి, ఏపీ అడ్వొకేట్‌ జనరల్‌ దమ్మాలపాటి శ్రీనివాస్‌, ఎమ్మెల్యే భానుప్రకాష్‌, సినీ నటుడు సందీప్‌, దర్శకుడు మాధవ్‌ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూప్రసాదాలతో సత్కరించారు.

ఆక్రమణలను ఉపేక్షించవద్దు


ప్రజా ఫిర్యాదులపై అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్‌ అదితిసింగ్‌

తిరుపతి తుడా: నగరంలో ఆక్రమణలను ఉపేక్షించవద్దని మున్సిపల్‌ కార్పొరేషన్‌ కమిషనర్‌ అదితి సింగ్‌ అధికారులను ఆదేశించారు. మున్సిపల్‌ కార్పొరేషన్‌ కార్యాలయంలో సోమవారం 'మీ కోసం –ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో ప్రజా ఫిర్యాదులపై సమీక్ష నిర్వహించారు. ఆమె అధికారులతో మాట్లాడుతూ నగరంలోని ఫుట్‌పాత్‌లు, కాలువలపై ఉన్న ఆక్రమణలను తొలగించాలని సూచించారు. నగరంలో మరింత మెరుగ్గా పారిశుధ్యాన్ని అమలు చేయాలని ప్రజారోగ్యశాఖ అధికారిని ఆదేశించారు. యూడీఎస్‌ మ్యాన్‌హోల్‌ ఓవర్‌ఫ్లోను అరికట్టేందుకు ఇంజినీర్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. అడిషనల్‌ కమిషనర్‌ చరణ్‌తేజ్‌ రెడ్డి, డిప్యూటీ కమిషనర్‌ అమరయ్య, హెల్త్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ యువ అన్వేష్‌, మున్సిపల్‌ ఇంజినీర్లు చంద్రశేఖర్‌, వెంకట్రామిరెడ్డి, రెవెన్యూ అధికారులు సేతుమాధవ్‌, కె.ఎల్‌.వర్మ, డిప్యూటీ సిటీ ప్లానర్‌ శ్రీనివాసులురెడ్డి, అడిషనల్‌ సిటీ ప్లానర్‌ బాలసుబ్రమణ్యం, మేనేజర్‌ చిట్టిబాబు, డీఈలు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోండి


బస్సు సౌకర్యాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న మేనేజర్‌ రామకృష్ణ

ఏర్పేడు: విద్యార్థులు బస్సు సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని వెంకటగిరి ఆర్టీసీ డిపో మేనేజరు రామకృష్ణ అన్నారు. మండలంలోని పల్లం జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో సోమవారం జెండా ఊపి బస్సు సౌకర్యాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పల్లం జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలకు చుట్టు పక్కల గ్రామాల నుంచి విద్యార్థులు హాజరవుతున్నట్లు వివరించారు. ప్రతి రోజు విద్యార్థులు ఆటోలకు చార్జీలు చెల్లించి వెళ్లడం కష్టతరంగా ఉందని డీపీటీఓ చెంగల్‌రెడ్డికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆనంద్‌ ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. డీపీటీఓ ఆదేశాల మేరకు బస్సు సరీ్వసు ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ మాజీ చైర్మన్‌ చంద్రశేఖర్‌ నాయుడు, ఉపాధ్యాయులు కేవీబాబు, రెడ్డెప్ప, వెంకటరామయ్య, రామసుబ్బమ్మ, పుష్పవాణి, సోమశేఖర్‌ రాజు, శ్రీరాములు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆయుష్‌తో మధుమేహ వ్యాధిని జయించవచ్చు


డాక్టర్‌ జ్యోతికుమార్‌

తిరుపతి తుడా: ఆయుష్‌ వైద్యం ద్వారా మధుమేహ వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చని డాక్టర్‌ జ్యోతి కుమార్‌ తెలిపారు. వైద్యుల దినోత్సవం సందర్భంగా సోమవారం ఆయుష్‌ వీజే హాస్పిటల్‌లో ఆయుష్‌ వైద్య విధానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్‌ జ్యోతికుమార్‌ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రపంచాన్ని వణికిస్తున్న మధుమేహ వ్యాధిని పూర్తిగా నిర్మూలించవచ్చని తెలిపారు. ఈ వ్యాధి వల్ల చాలా మంది నరాల బలహీనత, చర్మవ్యాధులు, మూత్ర సంబంధ వ్యాధులు, నేత్ర, గుండె సంబంధ వ్యాధులతో బాధపడుతున్నారని చెప్పారు. తమ సుదీర్ఘ అనుభవంతో ఏ.బీ.సీ.డీ (ఏ– ఆయుష్‌ థెరపీ, బీ– బయోలాజికల్‌ మెడిసిన్‌, సీ– చేంజ్‌ లైఫ్‌ స్టయిల్‌, డీ– డైట్‌) కార్యక్రమం ద్వారా ప్రతిఒక్కరూ ఈ వ్యాధులను జయించవచ్చునన్నారు.

బడిఈడు పిల్లలను బడిలో చేర్చండి


స్టూడెంట్స్‌ కిట్స్‌ అందజేస్తున్న నిర్మల్‌కుమార్‌

ఏర్పేడు: బడిఈడు పిల్లలను బడిలో చేర్చాలని ప్రధానోపాధ్యాయుడు నిర్మల్‌కుమార్‌ అన్నారు. మండలంలోని బండారుపల్లి జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో సోమవారం నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా ర్యాలీ చేసి, విద్యార్థులకు స్టూడెంట్స్‌ కిట్స్‌ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని వసతులు ఉన్నట్లు వివరించారు. గ్రామాల్లో బడిఈడు పిల్లలను గుర్తించి బడిలో చేర్చాలని సూచించారు. విద్యార్థులు చదివి ఉన్నత స్థానాలకు వెళ్లాలని చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌ శివారెడ్డి, రెడ్డివారి గురవారెడ్డి, ఉపాధ్యాయులు సుబ్రమణ్యం, గుణశేఖర్‌రెడ్డి, ద్వారకానాథరెడ్డి, రాధాకుమారి, వెంకటేశులు, కుమారరాజా, ఉమామహేశ్వర్‌, రాధాకుమారి, సీఆర్పీ వెంకటమునిరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం


డాక్టర్స్‌ డే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్‌ సిపాయి సుబ్రమణ్యం


యూత్‌ హాస్టల్‌లో అవగాహన కార్యక్రమం

తిరుపతి తుడా: క్యాన్సర్‌ మహమ్మారి చాప కింద నీరులా విస్తరిస్తోందని ఎమ్మెల్సీ డాక్టర్‌ సిపాయి సుబ్రమణ్యం అన్నారు. అంతర్జాతీయ డాక్టర్స్‌ డే సందర్భంగా స్థానిక యూత్‌ హాస్టల్‌లో సోమవారం తిరుపతి డివిజన్‌ కమ్యూనిటీ పారా మెడికల్‌ అండ్‌ ప్రైమరీ హెల్త్‌ కేర్‌ ప్రొవైడర్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ డాక్టర్‌ సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని అన్నారు. వ్యాధిని ఆదిలోనే గుర్తిస్తే సమస్యను విజయవంతంగా అధిగమించవచ్చని ఆయన స్పష్టం చేశారు. అసోసియేషన్‌లో ఇలాంటి అవగాహన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. దామోదర్‌ రెడ్డి, అసోసియేషన్‌ నాయకులు వేణు, మంజుల, ప్రేమ్‌ కుమార్‌, కల్పన, రామచంద్ర భూపతి, విజయ్‌ కుమారులు పాల్గొన్నారు.

రష్‌లో ఘనంగా డాక్టర్స్‌ డే

తిరుపతిలోని రష్‌ మల్టీ సూపర్‌ స్పెషాలిటీ ఆసుపత్రిలో సోమవారం డాక్టర్స్‌ డేను ఘనంగా నిర్వహించారు. ఆసుపత్రి అధినేత ఎమ్మెల్సీ డాక్టర్‌ సిపాయి సుబ్రమణ్యం పాల్గొని వైద్యుల బాధ్యతలను గుర్తు చేశారు. రోగులకు నాణ్యమైన వైద్యాన్ని అందించడంపై వైద్యులు దృష్టి సారించాలని కోరారు. రష్‌ వైద్యులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్‌ సిపాయి కీర్తి సాగర్‌రెడ్డి, డాక్టర్‌ సిపాయి మౌనరెడ్డి, డాక్టర్‌ కృష్ణ కాంత్‌, గౌరీ, చందన కుమార్‌, డాక్టర్‌ బాబురావు తదితరులు పాల్గొన్నారు.

బీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి


ఐక్యత చాటుతున్న బీసీ ఉద్యోగుల ఫెడరేషన్‌ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్‌: బీసీ ఉద్యోగులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బీసీ ఎంప్లాయిస్‌ ఫెడరేషన్‌ సమన్వయకర్త బడి సుధాయాదవ్‌ తెలిపారు. సోమవారం తిరుమల బైపాస్‌ రోడ్డులోనున్న బీసీ ఎంప్లాయిస్‌ ఫెడరేషన్‌ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో బడి సుధాయాదవ్‌ను సమన్వయకర్తగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ ఉద్యోగులు ఐక్యతతో సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్‌ వ్యవస్థాపక అధ్యక్షుడు బి.గోపాల్‌, జిల్లా ప్రధాన కార్యదర్శి వంకీపురం పవన్‌, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.భాస్కర్‌, గౌరవాధ్యక్షుడు సురేష్‌, బీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

రుయా ఇన్‌చార్జి ఏడీగా రమేష్‌


ఇన్‌చార్జ్‌ ఏడీ రమేష్‌ను సత్కరిస్తున్న ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు రాజా తదితరులు

తిరుపతి తుడా: తిరుపతి రుయా ఆసుపత్రి ఇన్‌చార్జ్‌ ఏడీ(అసిస్టెంట్‌ డైరెక్టర్‌)గా పరిపాలనా అధికారి ఎం.రమేష్‌ను నియమించారు. ఈ మేరకు ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఏడీగా పని చేసిన రత్నరాజు ఆదివారం పదవీ విరమణ చేశారు. ఆయన స్థానంలో పరిపాలన అధికారి రమేష్‌ను ఇన్‌చార్జ్‌గా ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా ఆయనకు ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు రాజా, ఇతర కార్యవర్గం ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

భాష్యంలో జాతీయ వైద్య దినోత్సవం


భాష్యంలో నిర్వహించిన జాతీయ వైద్య దినోత్సవంలో పాల్గొన్న డాక్టర్‌ కె.శివప్రసాద్‌ తదితరులు

తిరుపతి ఎడ్యుకేషన్‌: తిరుపతి న్యూబాలాజీ కాలనీలోని భాష్యం పాఠశాలలో సోమవారం జాతీయ వైద్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్‌ కె.శివప్రసాద్‌ పాల్గొన్నారు. పిల్లలకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. చేతులను శుభ్రంగా కడుక్కొని ఆహారం తీసుకోవాలని, గోర్లను కత్తిరించుకోవాలని, ఉతికిన బట్టలు ధరించాలని తదితర అంశాలపై పిల్లలకు అవగాహన కల్పించి, సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో భాష్యం జోనల్‌ ఇన్‌చార్జి లక్ష్మణరావు, ప్రిన్సిపల్‌ నేతాజీ, జెడ్‌సీఓ బిందు మాధవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో సీజనల్‌ వ్యాధులు దూరం


సీజనల్‌ వ్యాధులపై అవగాహన కార్యక్రమం

చంద్రగిరి: పరిసరాల శుభ్రతతోపాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడం ద్వారా సీజనల్‌ వ్యాధుల నుంచి దూరంగా ఉండవచ్చునని జిల్లా కుష్టు, క్షయ వ్యాధి నివారణ అధికారి కిరణ్‌కుమార్‌ అన్నారు. మండల పరిధిలోని కొటాల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్‌ ప్రియాంక ఆధ్వర్యంలో జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. జులై 8వ తేది నుంచి 15 రోజుల పాటు ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. సోమవారం నుంచి డయేరియా వ్యాధి నియంత్రణ కోసం విస్తృతంగా ప్రచారం చేస్తున్నామని, ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న క్రమంలో నీరు కలుషితమయ్యే అవకాశం ఉందన్నారు. కలుషితమైన నీటిని తాగడం ద్వారా డయేరియా వచ్చే అవకాశం ఉందని, నీటిని కాచి, చల్లార్చి తాగాలని సూచించారు. పరిసరాలలో నీళ్ల నిల్వ ఉన్నట్లైతే వెంటనే వాటిని తొలగించాలన్నారు. అలా తొలగించకపోతే అవి దోమలకు ఆవాస కేంద్రాలుగా మారి డెంగీ, మలేరియా, టైఫాయిడ్‌ తదితర విష జ్వరాలు వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. విద్యార్థులతోపాటు ప్రజలంతా తగిన జాగ్రత్తలు తీసుకుని, ఆరోగ్యకర జీవనం సాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వైద్యుల దినోత్సవం




మాట్లాడుతున్న స్విమ్స్‌ డైరెక్టర్‌, వైష్ణవి ఆస్పత్రిలో కేక్‌ కట్‌ చేస్తున్న మేయర్‌ డాక్టర్‌ శిరీష


స్విమ్స్‌: వైద్య దినోత్సవంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్‌ శ్రీహరికి సత్కారం

తిరుపతి తుడా: స్విమ్స్‌ యూనివర్సిటీలో సోమవారం వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డైరెక్టర్‌ డాక్టర్‌ ఆర్‌వీ కుమార్‌ కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి, ప్రారంభించారు. సమాజంలో వైద్యుల స్థానం, వైద్యులు అందించాల్సిన సేవలపై ఆయన సూచనలు చేశారు. కోవిడ్‌ మహమ్మారి ప్రపంచాన్ని అతలాకుతలం చేసిన క్రమంలో వైద్యులు ప్రాణాలకు తెగించి ప్రజల్ని కాపాడారని ఆయన కొనియాడారు. వైద్య రంగంలో ఎదురవుతున్న సవాళ్లను ఎప్పటికప్పుడు అధిగమించి ఆధునిక వైద్య విధానాన్ని అందుబాటులోకి తేవడంలో వైద్యరంగం కొత్త పుంతలు తొక్కుతోందన్నారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్‌ వైద్యాధికారులు డాక్టర్‌ అల్లాడి మోహన్‌, డాక్టర్‌ రామ్‌, డాక్టర్‌ శివకుమార్‌, డాక్టర్‌ రాజశేఖర్‌, డాక్టర్‌ రమేష్‌ చంద్ర, డాక్టర్‌ సత్యవతి, డాక్టర్‌ వెంకటరామిరెడ్డి, డాక్టర్‌ ప్రసాద్‌, డాక్టర్‌ వనజాక్షమ్మ పాల్గొన్నారు. అదేవిధంగా అంతర్జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకొని తిరుపతిలోని వైష్ణవి ఆసుపత్రిలో నగర మేయర్‌ డాక్టర్‌ శిరీష, ఆసుపత్రి అధినేత డాక్టర్‌ మునిశేఖర్‌, ఇతర వైద్యులు సిబ్బంది సంబరాలు నిర్వహించారు.

ఘనంగా డాక్టర్స్‌ డే

తిరుపతి కల్చరల్‌: కరకంబాడి రోడ్డులోని అట్లాంటిస్‌ ది వరల్డ్‌ స్కూల్లో సోమవారం డాక్టర్స్‌ డే సందర్భంగా విద్యార్థులు వినూత్న ప్రదర్శన నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు స్టెతస్కోప్‌ రూపంలో కూర్చొని, డాక్టర్లకు తమ అభివాదం, కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల అధినేత కేఎస్‌ వాసు మాట్లాడుతూ సమాజానికి డాక్టర్లు అందిస్తున్న అమూల్యమైన సేవలను వివరించారు. పాఠశాల డైరెక్టర్లు కేఆర్‌ అనురాధ గోపాల్‌, ప్రమీల, కృష్ణన్‌, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


స్టెతస్కోప్‌ రూపంలో డాక్టర్లకు కృతజ్ఞతలు తెలియజేస్తున్న విద్యార్థులు